క్లుప్తంగా

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : ఆర్డీఓ భవాని



రైతు సమస్యను తెలుసుకుంటున్న ఆర్డీఓ

పలమనేరు: రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వినతుల పరంగా అందే సమస్యల పరిష్కారంలో సంబంధిత సిబ్బంది ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని ఆర్డీఓ భవాని హెచ్చరించారు. మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీ శ్రీరంగరాజపురంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ప్రజల నుంచి అందిన అర్జీలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, ఇప్పుడు కుప్పలుతెప్పలుగా వస్తున్న అర్జీలలో 90 శాతం రెవెన్యూ పరమైన ఇబ్బందులేనన్నారు. గతంలో సిబ్బంది సక్రమంగా పనులు చేయకపోవడంతోనే ఇప్పుడు సమస్యలొస్తున్నాయని, ముఖ్యంగా రీ-సర్వే ఇష్టానుసారంగా చేసి రైతుల భూముల్లో హెచ్చుతగ్గులు చేశారని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చేసిన తప్పులను సరిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఆనందబాబు

పలమనేరు: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టిని సారించాలని పలమనేరు నియోజకవర్గ ఏపీ ఎన్జీవోల అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించి మాట్లాడారు. తమ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని విమర్శించారు. నాయకులు లక్ష్మీపతి, వినోద్, భాస్కర్, గాయత్రి, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.


హైందవ ధర్మాన్ని కాపాడుకుందాం



పులిచెర్ల(కల్లూరు): ఆలయాల్లో హిందూ సాంప్రదాయాల పరిరక్షణకు, హైందవ ధర్మాన్ని కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలని పలువురు కోరారు. దీనికి సంబంధించి శుక్రవారం చల్లావారిపల్లె అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వాల్‌పోస్టర్లను ప్రదర్శించారు. దేవాలయాలకు ప్రభుత్వం పాలక మండళ్లను ఏర్పాటు చేసి నిర్వహిస్తుండడంతో ఆ వ్యవస్థ గాడి తప్పుతోందని పేర్కొన్నారు. హుండీలో వేసే ముడుపులు ,కానుకలు దుర్వినియోగం అవుతున్నాయని హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ లేకుండా స్వయం ప్రతిపత్తి కలిగిన ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగించాలని హిందూ పరిషత్ ఒక జాతీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇదే విషయమైన జనవరి 5న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన హైందవ శంఖారావం బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

పుంగనూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షాకు వ్యతిరేఖ నినాదాలు చేశారు. అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ, అమీత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలన్నారు.



పలమనేరులో నాలుగువేల ఇళ్ల జగనన్న కాలనీ



గ్రామాల్లో కనిపించే సచివాలయాలు, ఆర్‌బీకేలు



నాడు-నేడు ద్వారా మారిన బడులు



మండిపేట కోటూరుకు వేసిన తారురోడ్డు

జగనన్న సేవలను జనం మరువగలరా?

- మారిన ప్రభుత్వ బడులు, ఆస్పత్రులు
- జగనన్న పాలనలోనే అభివృద్ధి, సంక్షేమానికి మొత్తం రూ.2,635కోట్లు
- నాడు సంక్షేమ వెలుగులు నేడు తప్పని ఎదురు చూపులు
- జగనన్న హామీలన్నీ నెరవేర్చారు
- చంద్రబాబు ఇచ్చిన హామీలను అటకెక్కించారు



గత ఏడాది పలమనేరులో విద్యార్థులు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ(ఫైల్)

పలమనేరు: గత వైఎస్సార్‌సీపీ పాలనలోనే పలమనేరు నియోజకవర్గం ఎంతో చెందిందని గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధికి, ప్రస్తు కూటమి పాలనకు ఉన్న తేడాని నియోజకవర్గ ప్రజలు ప్రత్యక్ష్యంగా చూసి బేరీజు వేసుకుంటున్నారు. అప్పట్లో రైతుభరోసా కేంద్రాలు, ఇంటింటికీ వైద్యసేవలు, నాడు-నేడుతో రూపురేఖలు మారిన బడులు, విద్యార్థులకు ట్యాబ్‌లు, బడుల్లో ఏఎంపీ ప్యానెళ్లు, డిజిటల్ బోర్డులు, స్మార్ట్ టీవీలు, ఆంగ్ల మాధ్యమం, ఆస్పత్రులు, గ్రామ సచివాలయాల్లోనే ప్రజలకు అందుతున్న సేవలు, ఇంటివద్దకే రేషన్ సరుకులు..ఇలా పలు సేవలు ప్రజల ముంగిట చేరాయి. అలాగే ఆయా గ్రామాల్లో కనిపిస్తున్న సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, బాగుపడిన రోడ్లు, జగనన్న పాలవెల్లువ సెంటర్లు మొదలైనవి అభివృద్ధికి సజీవ సాక్ష్యంగా ఉంటున్నాయి. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మరోసారి అభివృద్ధిపై సింహావలోకనం.

జగనన్న పక్కా గృహాలపై ఇదీ లెక్క

నియోజకవర్గంలోని మున్సిపాలిటీ, ఐదుమండలా ల్లో మొత్తం 13,307ఇళ్లను మంజూరు చేశారు. వీటిల్లో 9180 ఇళ్లపూర్తి చేశారు. వీటితోపాటు 12,723 మందికి అనుభవ ధ్రువపత్రాలు అందజేసింది.

ఆస్పత్రుల అభివృద్ధికి..

పట్టణంలోని ఏరియా ఆస్పత్రి కోసం రూ.17కోట్లు, బైరెడ్డిపల్లెలో 24గంటల ఆస్పత్రి నిర్మాణానికి రూ. 1.50కోట్లు, గంటావూరు, ఎద్దులసంత వీధిలో పట్టణ ఆస్పత్రుల నిర్మాణాలకు రూ.1.60 కోట్లు, నియోజకవర్గంలోని పెద్దపంజాణి, గంగవరం, రాయలపేట, వీకోట, కొలమాసనపల్లె, తీర్థం, పత్తికొండ పీహెచ్‌సీల అభివృద్ధికి రూ.1.93కోట్లు ఖర్చు చేసి ప్రజా ఆరోగ్యానికి గత ప్రభుత్వం పెద్దపీట వేసింది.

నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట

నియోజకవర్గంలో నాడు-నేడు ఫేజ్-1లో 113 బడులకు రూ.27.31కోట్లు వెచ్చించారు. ఫేజ్-2లో 291 బడులకు రూ.118.06 కోట్లు ఖర్చుబెట్టారు. మొత్తం మీద 404 పాఠశాలలను రూ.145.37 కోట్లతో కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా మార్చేశారు. నియోజకవర్గంలోని మొత్తం బడుల్లో 48,200మంది విద్యార్థులుండగా రెండేళ్లలో కొత్త అడ్మిషన్లు 3వేలు పెరిగి విద్యార్థుల సంఖ్య 51వేలకు చేరింది.

జనం ముంగిటే సేవలు

గ్రామ సచివాలయాల్లో 545 పౌరసేవలుండగా ఇందులో 400 దాకా ప్రజలకు గ్రామాల్లోనే అందుబాటులోకి వచ్చాయి. ఎవరికి ఏ సేవలు కావాలన్నా సంబంధిత వలంటీర్లతో గడపవద్దకే సర్టిఫికెట్లు అందాయి. జగనన్నకు చెబుదాం ద్వారా ఎలాంటి సమస్యలైనా పరిష్కరించేందుకు గ్రామాల్లో సమావేశాలను నిర్వహించి వాటిని పరిష్కరించారు.

సంతోషంగా రైతన్నలు

రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆర్‌బీకేలతో ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందేవి. క్షేత్రస్థాయిలో రైతులకు శిక్షణ, ఉచిత పంటల బీమా తదితర సేవలు రైతన్నల దరిచేరాయి. 60వేలమందికి పైగా రైతులకు మేలు చేకూరింది. నియోజకవర్గంలో రెండు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను రూ.11 కోట్లతో గంగవరం, బైరెడ్డిపల్లె మండలాల్లో నిర్మించారు. వీటితో 1600మంది రైతులకు లబ్ధి కలిగింది.. రూ.16 మల్టిపుల్ గోదాములను రూ.6.40 కోట్లతో నిర్మించారు. ఆయా రైతులు పండించిన పంటలను గోదాములో నిల్వ చేసుకునే సౌకర్యం కలిగింది. శాస్త్రవేత్తల సలహాలు, భూసార పరీక్షల కోసం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో రూ.50లక్షలతో డా.వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌ను నిర్మించారు. రైతులకు 9 గంటల నాణ్యమైన విద్యుత్ కోసం నియోజకవర్గంలో రూ.75కోట్లతో మూడు సబ్‌స్టేషన్లు, రూ.69కోట్లతో 132 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి పూనుకోవడంతో ఉచిత విద్యుత్‌కు ఢోకా లేకుండా పోయింది.

నియోజకవర్గ వివరాలిలా..

నియోజకవర్గంలో మొత్తం మండలాలు	: ఐదు పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె, వీ.కోట
మొత్తం జనాభా	: 3,32,245 (2011 జనాభా లెక్కల మేరకు)
ప్రస్తుత జనాభా	: 3.50 లక్షల దాకా
మొత్తం ఓటర్లు	: 2,59,231
పురుషులు	: 1,28,824
మహిళలు	: 1,30,407

గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు	రూ.2,210 కోట్లు
25 రకాల సంక్షేమ పథకాలకు డీబీటీ ద్వారా లబ్ధిదారులకు	రూ. 1,615కోట్లు
నాన్‌డీబీటీ ద్వారా 1.93 లక్షల మందికి	రూ.595 కోట్లు
డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా లబ్ధి	రూ.2,210 కోట్లు

నియోజకవర్గంలో అభివృద్ధికి...

సీడీఎంఎఫ్, జీజీఎంపీ, జేజేఎం, జెడ్పీపీపీ, ఎఫ్ఎఫ్‌సీ నిధులతో అభివృద్ధి పనులకు చేసిన ఖర్చు	: రూ.30.35 కోట్లు
మొత్తం 92 గ్రామ సచివాలయాలకు	: రూ.34.95కోట్లు
88 రైతుభరోసా కేంద్రాలకు	: రూ.19.18 కోట్లు
57వైఎస్సార్‌హెల్త్ క్లినిక్‌లకు	: రూ.10కోట్లు
12 పాలసేకరణ కేంద్రాలకు	: రూ.4.48కోట్లు
28 డిజిటల్ లైబ్రరీలకు	: రూ.4.48 కోట్లు
నియోజకవర్గంలో 36కి.మీమేర 968 రోడ్ల పనులకు	: రూ.44.77 కోట్లు
పీఎంజీఎస్‌వై, ఈఏపీ నిధులతో 54 బీటీ, సీసీ రోడ్లకు	: రూ.77.56కోట్లు

పిల్లల భవిష్యత్తు మారిందని సంతోషించా



నేను టీచర్‌గా పనిచేసి బడిలో పిల్లల కష్టాలు, సౌకర్యాలు లేని పాఠశాలలు కళ్ళతో చూసి ఎంతో బాధపడేవాన్ని. జగన్ హయాంలో మారిన సర్కారు బడులను చూసి గర్వంగా భావించా, విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చి డిజిటల్ బోధన చూసి తల్లిదండ్రుల కంటే ఎక్కువగా ప్రభుత్వం బాధ్యత తీసుకుందని ఆనందించా. కానీ నేడు ఆపరిస్థితి పెద్దగా కనిపించడం లేదు. ఇటీవల నాడునేడు బడుల్లో మీటింగ్‌లు పెట్టారుగానీ వాటికోసం ఏం చేస్తామని ఎవరూ చెప్పలేదు.

-సోమచంద్రారెడ్డి, మాజీ ఉపాధ్యాయ సంఘ నేత, పలమనేరు

పేదవానికి వైద్యం ఇక బాగుంటుందిలే అనుకున్నా...



పట్టణంలోని ఏరియా ఆస్పత్రిను చూసి సంతోషపడ్డా. ఇక్కడి ఆస్పత్రి గతంలో ఎలా ఉండేదో నాకు తెలుసు. రోగులకు సౌకర్యాలులు లేక గదుల్లో ఫ్యాన్లు లేక, తాగేందుకు మంచినీళ్ళు లేక రోగులు ఎక్కువగా వస్తే వరండాలో పడిఉండడం చూశా. కానీ వైఎస్సార్ పాలనలో మారిన ఆస్పత్రి, 108,104, ఇంటివద్దకే వైద్యసేవలను చూశా. 108 సేవలు, ఆస్పత్రుల్లో అన్ని వ్యాధులకు ఆరోగ్యశ్రీ ఇవంతా ఇప్పుడు లేవేననే బాధ కలుగుతోంది.

-ఈశ్వరయ్య, మాజీ సర్పంచ్, మొరం, పలమనేరు మండలం

చౌడేపల్లెకు బీపీహెచ్‌యూ మంజూరు

- రూ.50లక్షలతో నిర్మాణం
- డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి వెల్లడి



ప్రభుత్వాసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వాసుపత్రికి బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (బీపీహెచ్‌యూ) మంజూరైందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి తెలిపారు. శుక్రవారం ఆమె ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. రూ.50 లక్షలతో త్వరలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రంలో గర్భవతులకు మెరుగైన సేవలందించేందుకు వీలవుతుందని చెప్పారు. రోగులకు వైద్యసేవలందించడంతో పాటు వ్యాక్సినేషన్ తదితర కార్యక్రమాల్లో వంద శాతం లక్ష్యాన్ని అధిగమించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కె పీఓ డాక్టర్ శిరీష, డాక్టర్ పవన్, పీహెచ్‌ఎన్ క్రిష్ణవేణి, సూపర్‌వైజర్ జమున, సిబ్బంది సునీత పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై 29 అర్జీలు



పెద్దపంజాణి: గ్రామసభ నిర్వహిస్తున్న తహసీల్దార్

పెద్దపంజాణి: భూ సమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రసన్న కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని సుద్దగుంట్లపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 29 మంది రైతులు వివిధ సమస్యలపై ఆయనకు అర్జీలు ఇచ్చారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సాయిరాజ్, ఆర్‌ఐ రాకేష్, వీఆర్వో శశికుమార్ పాల్గొన్నారు.

దిగువపల్లె రెవెన్యూ సదస్సులో 29 అర్జీలు

చౌడేపల్లె: మండలంలోని దిగువపల్లెలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 29 మంది రైతుల నుంచి అర్జీలు స్వీకరించినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ మాధవి తెలిపారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు రికార్డుల ఆధారంగా సైతం పరిష్కరిస్తామన్నారు. ఆర్‌ఐ భారతి, సర్వేయర్ గుణశేఖర్ పాల్గొన్నారు.

ఊటుపల్లెలో 7 వినతులు..

సదుం: మండలంలోని ఊటుపల్లె సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సమస్యలపై ఏడుమంది రైతులు ఫిర్యాదులు చేశారని తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్ తెలిపారు. సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు స్వరూప పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

పెద్దపంజాణి: ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ బాలాజి లబ్ధిదారులను కోరారు. శుక్రవారం మండలంలోని లింగాపురం పంచాయతీలో ఆయన పర్యటించారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు బాలచందర్, మురళి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బిందుసేద్యంతో మంచి ఫలితాలు సాధించండి

- రైతులతో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



రైతులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

కుప్పం రూరల్: రైతులు ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న బిందుసేద్యం పరికరాలను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన కుప్పం మండలం దాసేగౌనూరు, గోపనపల్లె, మంకలదొడ్డిలోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. వ్యవసాయాన్నిలాభసాటిగా చేసుకునే దిశగా రైతాంగం పంటలను సాగు చేయాలని, అలాగే తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ దిగుబడి సాధించేందుకు బిందుసేద్యం చేయడం మంచిదని రైతులకు కలెక్టర్ సూచించారు. పాడి పరిశ్రమతో నష్టం తక్కువ అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రతి ఒక్కరూ గోకులం షెడ్ల నిర్మాణం చేసుకోవాలని కోరారు. ఎక్కడ నిర్మాణంలో నాణ్యతా లోపాలు లేకుండా చూడాలన్నారు. ఈ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని రైతులు, అధికారులను ఆదేశించారు. అనంతరం రైతులతో పంటల సాగు, మార్కెట్ సదుపాయం వంటి విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో కడా పీడీ వికాస్ మర్మత్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకపూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయంలో సాంప్రదాయరీతిలో అర్చనలు, అభిషేక పూజల అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, రంగు రంగు పూలతో ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ చేశారు.

ముగిసిన గీతాజయంతి ప్రవచనాలు



గీతా ప్రవచనకర్త నాగభూషణంను సన్మానిస్తున్న సభ్యులు

పుంగనూరు: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో 18 రోజులుగా నిర్వహిస్తున్న గీతాజయంతి ప్రవచనాల కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ప్రవచనకర్త వక్కంతం నాగభూషణంను భక్త బృందం సన్మానించింది. ప్రతి ఒక్కరూ గీతను అర్థం చేసుకుని అందులో సత్యం, ధర్మం, ఆధ్యాత్మిక ఇత్యాది వాటిని జీవితంలో పాటించాలని కోరారు. కార్యక్రమంలో అగ్రహారం ఆశ్రమ నిర్వాహకులు పారిజాతమ్మ, టీపీఎస్ నాగరాజు, హిందూ సత్య ధర్మ దివ్య జ్ఞానజ్యోతి అధ్యక్షుడు వెంకటేష్, నీలభద్రయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో నీటి కష్టాలు



తహసీల్దార్ కార్యాలయం వద్ద నీళ్లను తోడుతున్న విద్యార్థులు

రొంపిచెర్ల: స్థానిక బీసీ హాస్టల్‌లో దాదాపు వందమంది విద్యార్థులు ఉన్నా రు. వీరంతా రొంపిచెర్ల అదర్శ పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. హాస్టల్‌లో నీటి అవసరాల నిమిత్తం ఒక నీళ్ల ట్యాంకర్ సామర్థ్యం కలిగిన సంపు ఏర్పాటు చేశారు. దీనికి నీటి కనెక్షన్ ఉంది. సంపు నీటిని విద్యార్థుల అవసరాలకు, వంటావార్పుకు వినియోగిస్తుంటారు. సంపు మోటార్ కాలిపోవడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. శుక్రవారం ఉదయం విద్యార్థులు హాస్టల్ పక్కనే ఉన్న తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న నీటి ట్యాంకులో నుంచి నీటిని తోడుకుని వాడుకోవాల్సివచ్చింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు నీటి సమస్య లు లేకుండా చూడా లని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై వార్డెన్ సురేష్ కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. బీసీ హాస్టల్‌లో సంపునకు నీరు వస్తుందని, దానికి మోటారు బిగించి నీరు వాడుకుంటున్నట్లు చెప్పారు సంపు మోటారు కాలి పోవడంతో రిపేరు చేయించడానికి మెకానిక్‌కు ఇచ్చామన్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా నీటిని సరఫరా చేస్తామన్నారు.


వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న వడ్డెర నాయకులు

వి.కోట: రాష్ట్రంలో వెనుకబడిన ఉన్న వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మండల వడ్డెర నాయకులు శుక్రవారం విజయవాడలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు వినతి పత్రం ఇచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి వీరుడు వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల్లో వడ్డెరలకు ప్రాధాన్యత ఇవ్వాలని, 2024 ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన పార్టీలు ఇచ్చిన హామీల మేరకు తమ కులస్తులకు రావాల్సిన రాయితీలను ఇవ్వాలని, ప్రభుత్వ కాంట్రాక్టులలో వడ్డెర యువతకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల వడ్డెర నాయకులు పవన్, భానుప్రకాష్, నారాయణ, రాజేంద్ర పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు



వి.కోట: వాణి విద్యాసంస్థల అధినేత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాల గురునాథ్ శుక్రవారం స్థానిక ఎస్సీ హాస్టల్‌లో వందమంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. దుప్పట్లతో పాటు పండ్లు వితరణ చేశారు. చలికాలంలో తమకు ఇబ్బందులు లేకుండా దుప్పట్లు ఇవ్వడం ఆనందంగా ఉందని విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ఎంపీపీ తమీమ్, నాయకులు ధీరజ్, కృష్ణమూర్తి, మురళి, హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈరోజు

జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు

పుంగనూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించనున్నట్టు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్‌షరీఫ్ తెలిపారు. శుక్రవారం పార్టీ నేతలు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అభిమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో కేక్ కటింగ్, సామాజిక సేవా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మండల వ్యాప్తంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. బైరెడ్డిపల్లె మండలం చప్పిడిపల్లెలో జగనన్న కటౌట్ ఏర్పాటు చేశారు.

చౌడేపల్లె/సదుం/పెద్దపంజాణి/వి.కోట/:

చౌడేపల్లె, సదుం, పెద్దపంజాణి , వి.కోట మండల కేంద్రాల్లోనూ శనివారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తామని, అందరూ హాజరై జయప్రదం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామ్మూర్తి, సదుం జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ధనుంజయ రెడ్డి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగారెడ్డి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కోరారు.

మామిడి పంట సాగుపై అవగాహన సదస్సు

రొంపిచెర్ల: మండలంలోని గానుగచింత గ్రామ పంచాయతీ కల్లావారిపల్లెలో మామిడి పంట సాగుపై శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఉద్యానవన శాఖాధికారి సంతోషి కుమారి తెలిపారు.

పలమనేరు మున్సిపల్ సమావేశం

పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలమనేరు: పట్టణంలోని 220 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా పలమనేరు నియోజకవర్గంలో శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు పలమనేరు ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.